Discourse – Jinnuru – 6 January 1985
Words of Grace

మనం జన్మాంతరాలలో మనం పోగు చేసుకున్న సంస్కారాల వల్ల, మనకి భగవంతుడు లేడని ఇటువంటి భావాలు వస్తాయి. మన హృదయంలో ప్రత్యక్షంగా పరమాత్మ ప్రకాశిస్తున్నప్పటికి జన్మాంతరాలలో మనకున్న సంస్కారాల వల్ల వున్న వస్తువు లేనట్లుగా అనిపిస్తుంది, లేని వస్తువు ఉన్నట్లుగా కనిపిస్తోంది.

అసలు పరమాత్మ విషయం అటు వుంచండి, లోకానికి సంభంధించినంతవరకు మీ హితవు కోరేవారు ఎంతమంది ఉన్నారు ఈ లోకంలో? లోకానికి సంభందించిన హితవు కోరేవారే లేనప్పుడు, పరమాత్మ గురించి మీకు చెప్పటానికి, మిమ్మల్ని ప్రేమించి, మీకు జ్ఞానం ప్రసాదించటానికి, హృదయపూర్వకంగా ప్రయత్నం చేసేవారు ఈ లోకంలో ఎంతమంది ఉన్నారు? మీ అభ్యుదయం కాని మీ శ్రేయస్సు కాని (అభ్యుదయం అంటే ఈ లోకానికి సంబందించిన మీ ఆరోగ్యం మీ ఐశ్వర్యం), మీ సుఖం కోరి మాట్లాడేవారు ఎంతమంది ఉన్నారు, మీ బంధువులలో కాని మీ స్నేహితులలో కాని? మీ అభ్యుదయాన్నే కోరనివారు, మీ పరమార్థాన్ని మీ మోక్షాన్ని ఎక్కడ కోరతారు?

సర్వసాధారణంగా మనస్సులో మలం వుండటం వల్ల మనకి వెలుగు కనిపించటంలేదు. శరీరంలో ఉన్న మలం ఏదన్నా మాత్ర వేసుకొంటే బయటికి వెళ్ళిపోతుంది. ఒకవేళ బయటికి వెళ్ళకపోతే మాత్ర వేసుకొంటే ఆముదం పుచ్చుకొంటే బయటికి వెళ్ళిపోతుంది. కాని మనస్సులో ఉన్న మలం ఆముదం పుచ్చుకొన్నా బయటికి వెళ్ళదు, మాత్ర వేసుకొన్నా బయటికి వెళ్ళదు. ఈ మలం ఎక్కడినుంచి వచ్చిందంటే, మనం పోగుచేసుకొన్న వాసనలే మనస్సులో మలం. మనస్సులో మలం పోగొట్టుకోటానికే భజనలని, కీర్తనలని, పూజలని, జపం అని, గురుసేవ అని, ఈశ్వర సేవ, తీర్థయాత్రలు, ఇవన్నీ మనస్సులో ఉన్న ఆవరణ దోషాన్ని, మలదోషాన్ని పోగొట్టుకోవటానికి మన పెద్దలు అనేక ఉపాయాలు చూపించారు మనకి.

మన అహంకారం దొడ్డి వేస్తుంది మనకి; ఇంటికి చుట్టూరు నాలుగు గోడలు వేసినట్టు, మన అహంకారం మనకి దొడ్డి వేసి చచ్చిపోయాక అందులోంచి బయటికి వెళ్ళనివ్వకుండా అందులోనే బ్రతికేలా చేస్తుంది. మన అహంకారమే మనకి ఆవరణ చుట్టి ఈ మలదోషాన్ని తయారుచేస్తుంది.

ఏ సంస్కారాలు అయితే, ఏ వాసనలు అయితే ఈ జన్మలో, ఈ శరీరం ఉండగా, మనని బాధ పెడ్తున్నాయో, అవన్నీ మనము ఒకప్పుడు ఎంతో ప్రీతితోటి ఇష్టంతోటి ప్రాక్టీసు చేసి తెచ్చుకొన్నవే. అవన్నీ ఈ రోజు మనని సంస్కారాల రూపంలో వాసనల రూపంలో ఎంతో బాధిస్తున్నాయి పీడిస్తున్నాయి.

ఆధ్యాత్మిక జీవితం అంటే మీ ఉద్దేశం అరగంట సేపు జపం చేయటమో పూజ చేయటమో అనుకొంటున్నారు. అది మంచిదే కాని అంతటి తోటి సరిపెట్టుకోకూడదు. మాటలలో జాగ్రత్తగా ఉండాలి. మాటలలో జాగ్రత్తగా లేకపోతే మనస్సు నిగ్రహంలోకి ఎలా వస్తుంది? మాట తీరే సరిగా లేనప్పుడు (బాగోనప్పుడు) మాట్లాడే పద్ధతే మనకి తెలియనప్పుడు, మాటల్ని ఎలా మాట్లాడాలో తెలియనప్పుడు, మాటలే మన స్వాధీనంలో లేనప్పుడు, మనం మాటే నిగ్రహించుకోలేనప్పుడు, మన మనస్సుని ఎలా నిగ్రహించుకోగలం? మాట బయటిది, మనస్సు లోపలిది.

మనకి ఒంటిమీద బాడి కడుక్కోవటమే తెలియనప్పుడు మనస్సులో బాడి ఎలా కడుక్కోగలం - అసలే చేతకాదు. పైన ఉన్న కురుపు ఆపరేషనే చెయ్యలేని వైద్యుడు లోపల ఉన్న పేగులు ఆపరేషన్ ఎలా చెయ్యగలడు? అదేవిధంగా శరీరం మీద బాడే తొలిగించుకోలేనప్పుడు మనస్సులో బాడి ఎలా తొలిగించుకోగలం? అందుచేత ఎవరైతే మనస్సుని నిగ్రహించుకోవాలని అనుకొంటున్నారో వాళ్ళు ముందు మాటని నిగ్రహించుకోవాలి. మాట నియమం, మాట నిగ్రహం ఉన్న వారికి మనస్సు నిగ్రహం వస్తుంది. మనం మాటలని గాలికి వదిలేసి, మాటలలో నిగ్రహం లేకుండా, ఓర్పు లేకుండా, మాటలో ఒక తీరు దిక్కు లేకుండా ఉంటే మనస్సు స్వాధీనం లోకి రాదు. స్వాధీనమైన మనస్సు కాని మన హృదయం వైపు తిరగదు. ఎందుకు మాటని స్వాధీనం చేసుకోవాలి అంటే, మాట నిగ్రహం వల్ల మనస్సు నిగ్రహం వస్తుంది.

ఎందుకు మనస్సు నిగ్రహం? ఎంత చదువు ఉన్నా, డబ్బు ఉన్నా, పలుకుబడి ఉన్నా మనస్సు నిగ్రహం రాదు. ఎలా వస్తుంది? ఆడంబరం లేకుండా మాట్లాడితే, ఆడంబరం లేకుండా జీవిస్తే, మీ వేషధారణ ఆడంబరం లేకుండా ఉంటే, మీరు కూర్చున్నా, మాట్లాడినా, ఎక్కడ ఏ పరిస్థితిలో ఉన్నా ఆడంబరానికి దూరంగా ఉంటే అప్పుడు మన మనస్సు స్వాధీనంలోకి వస్తుంది. అయితే మనం ఏదో 10 నిమిషాలు పూజ చేసి, జపం చేసి ఆడంబరంగా జీవిస్తే సత్యం తెలియదు.

ఎందుకు ఆడంబరంగా జీవించకూడదు అంటే సత్యానికి ఆడంబరం లేదు, సత్యానికి గర్వం లేదు. సత్యం నిర్మలమైన వస్తువు. ఆడంబరం లేని ఆత్మ, ఆడంబరం లేని సత్యం, ఆడంబరం లేని జ్యోతి, ఆడంబరం లేకుండా జీవించే వాడికే తెలుస్తుంది. నిరాడంబరంగా జీవించే వాడికే సత్యం సాక్షాత్కారం అవుతుంది.

మన దైనందిన జీవితంలో, మనం రోజు జీవించే జీవింతం కూడా యోగమే. మనం చూసే చూపులో, వినే మాటలో, మాట్లాడే మాటలో అన్నీ జాగ్రతగా ఉండాలి. కొంతమంది లోపలికి వెళ్ళే తిండి పదార్థాల విషయంలో జాగ్రతగా ఉంటారు కానీ లోపలినుంచి బయటికి వచ్చే మాటల విషయంలో జాగ్రతగా ఉండరు. దీనివల్ల లోపల మలం పెరుగుతుంది, అంటే కల్మషం పెరుగుతుంది, మనస్సులో క్షోభ పుడుతుంది.

మనస్సు నిగ్రహించుకోవటం మీకు నాకు కష్టం కాని, పరమాత్మకు కష్టం ఏమీ కాదు. మనం ఆత్మ యందు దృష్టి పెట్టుకొంటే పరమాత్మ యందు భక్తి కనక పెట్టుకొంటే అసలు నిగ్రహించుకోవటానికి మనస్సు అనేది ఉండదు. భక్తి అంటే ఎవడైతే తన మనస్సును భగవంతుని మీద పెడుతున్నాడో వాడే భక్తుడు. మీరు చూసుకోండి, మీ మనస్సు భగవంతుని మీద ఉంటే మీరు భక్తులు.

ఓర్పుగా క్షమగా ఉండాలి. ధ్రువుడు పినతల్లి అవమానం చేసిందని పినతల్లి మీద కోపంతోనే తపస్సుకి వెళ్ళాడు. తపస్సు వల్ల సాధించ వలసినది సాధించాడు; పినతల్లి మీద కోపం పోయింది. తపస్సు తరువాత అతని కోపం పోయింది. అంత కాలం తపస్సు తరువాత కోపం పోకపోతే అది తపస్సే కాదు. తపస్సుకి ఎందుకు వెళ్ళాడు? పినతల్లి అవమానం చేసిందని వెళ్ళాడు. కాని తపస్సు చేసాక, జ్ఞానం కలిగిన తరువాత, పినతల్లి మీద కోపం పోయింది. కోపం పోకపోతే, అవమానం చేసిందని బాధ పోలేదనుకోండి ఆ తపస్సు ఫలించినట్లు కాదు. రాగం ద్వేషం వంటి చిన్న చిన్న మెట్లే మనం గెంటలేకపోతే దాటలేకపోతే మనకి ఆత్మ తెలియదు.

ఆత్మ ఎక్కడో ఉందని, కాలం, ప్రపంచం, మనం ఇలా కూర్చొని మాట్లాడుకోవటం అంతా మాయ. ఆత్మ ఎక్కడో ఉందని, మనం ఏదో సాధిస్తామని, కాలం గొడవలు, ప్రపంచం గొడవలు, ఇంద్రియాల గొడవలు ఇవి అన్నీ కల్పితాలు. భవిష్యత్తు గురించి మనం ఆలోచించేలా చేస్తుంది మనస్సు. ఎందుకంటే ఆత్మ దగ్గరకి వెళ్ళకుండా ఇది ఒక మాయ. మనం ఎందుకు జాగ్రత్తగా ఉండాలంటే, మనస్సు రేపు గురించి, ఎల్లుండి గురించి ఆలోచిస్తుంది, జరిగిపోయిన విషయాలు ఆలోచిస్తుంది కాని ఆత్మ దగ్గరకి ప్రయాణం చెయ్యదు. రేపు అబద్ధమే, జరిగిపోయిన గొడవలు అబద్ధమే, భవిష్యత్తు అబద్ధమే, శరీరం పోయాక రాబోయే జన్మలు అబద్ధమే, ఇవి అన్నీ స్వప్నమే. మనస్సు ఈ స్వప్నాల గురించి ఆలోచిస్తుంది కాని, సాక్షాత్తుగా, ఇమిడియట్టగా (immediately) ఏమీ అడ్డు లేకుండా ప్రకాశిస్తున్న నిజమైన వస్తువు వైపు మనస్సుని ప్రయాణం చెయ్యమంటే చెయ్యదు. ఎందుకు ప్రయాణం చెయ్యదు అంటే మనస్సులో ఉన్న మలం వల్ల.

మనకి ఆత్మ కంటే దగ్గరగా సన్నిహితంగా ఉన్న వస్తువు సృష్టిలో లేనే లేదు. ఆత్మ ఒక్కటే నిజమైన వస్తువు. శరీరం జన్మిస్తోంది మరణిస్తోంది, ఆత్మకి ఎట్టి సంభందము లేదు. లోపల ఉన్న అజ్ఞానం వల్ల ఈ 6 అడుగుల శరీరం మనమే అనిపిస్తుంది. ఈ అజ్ఞానాన్ని తొలిగించుకోవటంకోసం ఏం ప్రయత్నం చేస్తున్నారు? పూజ చేసినా, జపం చేసినా, సమాధిలో ఉన్నట్టు ఉండాలి. పూజ జపం ఎందుకంటే మనస్సుని శుద్ధి చేసుకోవటం దాని యొక్క ప్రయోజనం. మనస్సు కనుక పవిత్రంగా నిర్మలంగా ఉంచుకొంటే ప్రాపంచిక సంకల్పాలు ఏమైనా వచ్చినా అవి కాలిపోతాయి. మనస్సు నిర్మలంగా లేకపోతే సంకల్పం దాన్ని ఉద్ధృతం చేసి, మనస్సు విజ్రుంభించేలా చేస్తుంది.

ఆధ్యాత్మిక జీవితంలో ఎవరైతే అడుగు పెట్టారో వారు ముందు ఆడంబరం లేకుండా జీవించడం నేర్చుకోవాలి, ఆడంబరం లేకుండా మాట్లాడటం నేర్చుకోవాలి. ఈ ప్రపంచంలో దేన్ని చూసి కూడా, ఈ ప్రకృతి ఐశ్వర్యాన్ని కాని, ప్రకృతి యొక్క కీర్తి, అంగబలం కాని, దేన్ని చూసి కాని గర్వం తెచ్చుకోకుండా జాగ్రత్తగా ఉండాలి.

యదార్థం చెప్పాలంటే మనకి శత్రువులు ఎవరూ మన బయట లేరు. మన మనస్సు, మన ఇంద్రియాలే మన శత్రువులు. ఈ శత్రువులతో పేచీ పెట్టుకోకుండా, ఎవరైతే ఈ మనస్సుని, ఇంద్రియాలని మచ్చిక చేసుకొంటున్నారో, ఇవి మన స్వాధీనపడి ఆత్మను తెలుసుకోవటానికి సహకరిస్తాయి. ఎదుటి మనుషులు ఎవ్వరూ మనకి అపకారం చెయ్యలేరు మన ఇంద్రియాలు మన స్వాధీనంలో ఉంటే; మనని క్షోభ పెట్టలేరు మన మనస్సు మన స్వాధీనంలో ఉంటే. అందుచేత ఎదుటి వాళ్ళ విషయం కాదు; మన మనస్సు మనకి ఎంతవరకు స్వాధీనంలో ఉంది, ఇంద్రియాలు ఎంతవరకు స్వాధీనంలో ఉన్నాయి చూసుకోండి. మనస్సు నిగ్రహం, ఇంద్రియాల నిగ్రహం చాల ముఖ్యం, ఆధ్యాత్మిక జీవితంలో ప్రవేశించే వారికి.

ఎందుకు భగవంతుడ్ని పొందటం అని కొంతమంది అంటారు. చచ్చిపోయాక కాలి బూడిద అయిపోతాము. మళ్ళీ జన్మ ఏమీ లేదు అంటూ ఉంటారు. భగవంతుడు లేడు అంటారు. ఈ రకంగా మాట్లాడే వాళ్ళని చూసి మనం కోపం తెచ్చుకోకూడదు, ఉద్రేకం తెచ్చుకోకూడదు, జాలి పడాలి. ఎందుకంటే మన మనస్సులో ఏమైనా అంటురోగం

ఉన్నప్పుడు, మన మనస్సుకి ఏదైనా కంటామినేషన్ కలిగినప్పుడు, మన మనస్సులో దోషం ఉన్నప్పుడు ఆత్మ లేదని దేముడు లేడని అనిపిస్తుంది.

మీకు ప్రపంచానికి ఆధారంగా ఆత్మ అనే వస్తువు లేదు అని అనిపిస్తోంది అనుకోండి, భగవంతుడు లేడని, సత్యం లేదని అనిపిస్తోంది అనుకోండి, మీరు ఎవరినీ అడగక్కరలేదు, పుస్తకాలు చదవక్కరలేదు, గురువుని అడగక్కరలేదు. మీ మనస్సులో దోషం ఉందని మీరు కొండ గుర్తు పెట్టుకోండి. మీ మనస్సులో ఎప్పుడైతే దోషం ప్రవేశించిందో అప్పుడు నిజం అబద్ధంగా, అబద్ధం నిజంగా కనిపిస్తుంది.

మన చుట్టుపక్కల ఎవరికైనా కలరా, మసూచికం, పొంగు, ఏమైనా జబ్బులు వస్తే మనం భయపడుతున్నాము, అవి మనకి కూడా వస్తాయని. కాని ఎదుటి వారి మనస్సులో రాగ ద్వేషాలు మనం కూడా నేర్చుకొంటున్నామని, ఆ రాగద్వేషాలు వచ్చి మన మీద పడుతున్నాయని, అజ్ఞానంలో కూరుకుపోతున్నామని మనం ఏమైనా భయపడుతున్నామా? మనస్సులో (contamination) కంటామినేషన్ వస్తే కంగారు పడతామా? ఎందుకు కంగారు పడటంలేదు - మన శరీరానికి ఇచ్చే విలువ మన మనస్సుకి ఇవ్వటంలేదు. మీ శరీరానికి ఇచ్చే విలువే మీ మనస్సుకి ఇవ్వనప్పుడు, ఇక మీరు ఆత్మని ఏమి తెలుసుకొంటారు? ఆత్మని తెలుసుకొనేది మీ శరీరం కాదు, మీ మనస్సు తెలుసుకొంటుంది. మరి మనస్సుని శుచి చేస్తున్నారా మీరు? మన బట్టల మీద, శరీరం మీద దుమ్ము పడుతుంది అని కంగారు పడతాము. కాని మీ ఇల్లుకి ఇచ్చే విలువ కూడా మీ మనస్సుకి ఇవ్వటంలేదు. ఇల్లుని దులుపుకొంటున్నారు కాని మనస్సుని దులుపుకోవటం లేదు. ఇల్లుని చీపురుతో ఎలా అయితే దులుపుకొంటున్నారో మనస్సుని దులుపుకోవటానికి ఈశ్వర నామాన్ని స్మరించమంటారు మన పెద్దలు.

ఈశ్వరుడిని స్మరించగా స్మరించగా, కారణం లేకుండా ఈశ్వరుడ్ని స్మరిస్తుంటే - కొంత మందిని చూస్తే మనకి కారణం లేకుండా ప్రేమ కలుగుతుంది, ఎంచేత ప్రేమిస్తున్నాం అంటే మనకే తెలియదు. భగవంతుడు భగవద్గీత చెప్పాడు, మన దగ్గర ఏమైనా డబ్బులు పుచ్చుకొన్నాడా, ఉపకారం ఆశించాడా? భగవాన్ రమణ మహర్షి రమణగీత చెప్పాడు, మనం ఏమైనా పే చేసామా, మన దగ్గర ఏమైనా కీర్తి ఆశించాడా? ఏమీ వాంఛించలేదు. సూర్యుడు మనకి వెలుతురు ఇస్తున్నాడు. ఎలక్ట్రిసిటీ వాళ్ళలాగా ఏమైనా డబ్బులు కట్టమని అంటున్నాడా? భగవంతుడు కారణం లేకుండానే కేవలం జీవుడి పట్ల కటాక్షం కొద్దీ అనుగ్రహిస్తున్నాడు. అలా స్వార్థం లేని వాళ్ళే నిజం చెప్పగలరు. కాని, లోపల ఏ మాత్రం స్వార్థం ఉన్నా మలం ఉన్నా సత్యాన్ని చెప్పలేరు, నిజాన్ని చెప్పలేరు, మీ మనస్సు స్వాధీనం లోకి వచ్చేలా చెయ్యలేరు.

మీకు నచ్చిన నామాన్నో రూపాన్నో పట్టుకొంటే, మీ అహంకారం మీరు ఏమీ కష్టపడనక్కరలేకుండానే పడిపోతుంది. నిరంతరం పరమేశ్వరుని పాదాలు స్మరించటం, పరమేశ్వరుని యొక్క నామం మీద ప్రీతి పెంచుకోవటం వల్ల, మీకు ఇష్టమైన నామాన్ని స్మరించటం వల్ల, నెమ్మదిగా మీ అహంకారం పలచబడిపోయి, మీకు తెలియకుండా రాలిపోతుంది.

ఎవరైనా దొంగవాడు మీ ఇంట్లో దొంగతనం చేయాలనుకొన్నాడు అనుకోండి, నిర్ణయించుకొన్న రోజునే రాడు. మీ ఇంట్లో పెరటి గుమ్మం ఎక్కడ ఉంది, వీధి గుమ్మం ఎక్కడ ఉంది, ఇంట్లో మనషులు ఎవరు ఉన్నారు వంటి వివరాలు అన్నీ

తెలుసుకొని, ఎప్పుడో ముహూర్తం పెట్టుకొని వస్తాడు దొంగతనానికి. అదే విధంగా పరమేశ్వరుడు కూడా దొంగ లాంటివాడు - కృష్ణుడు దొంగ, శివుడు దొంగ. మనం ఈశ్వరుడిని ప్రార్థించగా ప్రార్థించగా, ప్రార్థిస్తూ కాలక్షేపం చేస్తూంటే, మన కాలం కోసం ఎదురు చూస్తూ ఉంటే, ఆ దొంగ ఎప్పుడైతే మన అహంకారం తీసివేయాలని నిర్ణయానికి వచ్చాడో - ఏ రోజున తీయాలి ఎన్ని గంటలకు తీయాలి, ఏ సెకండ్ లో తీయాలి - (మనకి తెలియకుండా దొంగవాడు మన ఇంట్లో వస్తువులు ఎలా పట్టుకుపోతాడో) అలా మనకి తెలియకుండా మన అహంకారాన్ని రాలగొట్టి పట్టుకుపోతాడు. అంచేత భగవంతుడ్ని ప్రార్థించటం.

భగవంతుడు మీకు ఎన్ని బహుమానాలు ఇచ్చినా ఎక్కడో అందలం మీద కూర్చో పెట్టినా, సింహాసనం మీద కూర్చోపెట్టినా, అది అంతా మాయ. ఎప్పుడైతే మనలో అహంకారాన్ని తీసివేసాడో అప్పుడే మనం భగవంతుని స్వరూపాన్ని పొందుతాము, అది ఒక్కటే నిజం. మిగతావి అన్నీ మనం నిజం అనుకొన్నప్పటికీ స్వప్నం తోటి సమానం. ఇవ్వాళ పచ్చగా ఉండి రేపు ఎండిపోయేటివి ఈ లోకంలో ఉండే వస్తువులు అన్నీ.

ఇక్కడ హృదయంలో ఉన్న వస్తువుని వదిలేసి, భగవంతుడ్ని వదిలేసి, హృదయంలో సత్యం ఉంది - దాన్ని వదిలేసి, మళ్ళీ జన్మలో ఏమవుతుంది; మంచి జన్మ రావాలి మళ్ళీ తరువాత ఏమవుతుంది, ఎక్కడో కాలం గురించి ఆలోచిస్తున్నాము అంటే, అది కూడా మనస్సులో ఉన్న దోషం వల్ల. కొంతమంది అనుకొంటారు కృష్ణుడు ఎప్పుడో ఉన్నాడు, కృష్ణుడి కాలంలో మనం లేకపోయామని, రాముడు కాలంలో లేము అనుకొంటాము. ఆత్మ లేకుండా ఎప్పుడైనా ఉందా? ఈ కృష్ణుడు రాముడు శరీరమా? ఆత్మ అప్పుడూ ఇప్పుడూ భవిష్యత్తు లో కూడా ఉంది. ఆత్మ ఎప్పుడూ ఉంది. మన మనస్సుకి భూత భవిష్యత్తు వర్తమానం కానీ ఆత్మకి కాలం ఏమిటి? ఇది అంతా మనస్సు యొక్క కల్పన. రాబోయే జన్మ అని గతించిన జన్మ అని, ఈ జన్మల గురించి మాట్లాడే విషయాలు అన్నీ మనస్సు చేసే గారడీ. మన అహంకారం చేసే గారడీ.

ఎప్పుడైతే అహంకారం అణిగిందో, ఆత్మదర్శనం అయ్యిందో, ఆత్మ తెలిసిందో అప్పుడు మిమ్మల్ని చూసి మీరే ఆశ్చర్యపోతారు. గతించింది అంతా స్వప్నంలా అనిపిస్తుంది. మనం ఆత్మని తెలుసుకోవటం వల్ల మనం పరాయి వాళ్ళ ఇంటికి వెళ్తునాము అనుకోకండి. మన ఆత్మ మన నిజమైన ఇల్లు. ఆ నిజమైన ఇంటికి మనం వెళ్ళేవరకు, నిజమైన ఆత్మ తెలిసేవరకు ఈ శరీరాలు అనే కొంపలలోకి రావాలి, బయట కొంపలలోకి వెళ్ళాలి. శరీరమే కొంప, మళ్ళీ దీనికి ఇంకో కొంప కావాలి. శరీరం ఏదో ఒక కొంపలో ఉండాలి నీడకి. ఈ శరీరాలు ఇలాగే తిరుగుతూ ఉంటాయి.

మీకు ప్రకృతి యందు వాసన ఉంటే, కోరిక ఆసక్తి ఉంటే పరమాత్మ దొరకడు. భక్తి అనేది కూడా గంగ. ఆ భక్తి తోటి మనస్సుని శుచి చేసుకోవాలి, అంతఃకరణాన్ని శుచి చేసుకోవాలి. మనని ఎవరో మోసం చేస్తున్నారు అనుకొంటాము. మన ఇంద్రియాలు మన అహంకారము మన మనస్సే మనని మోసం చేస్తున్నాయి. పరమేశ్వరుడిని నిరంతరం స్మరణ చేయగా చేయగా పుణ్యం వస్తుంది, మోక్షానికి కూడా దారి కనిపిస్తుంది.

అరటకట్ల అమ్మగారు ఒక ప్రశ్న అడిగారు, మంచి ప్రశ్న. తమోగుణం వస్తే దానిని తీసివేసి సత్వగుణాన్ని పెట్టుకోగలమా అని అడిగారు. అలా ప్రవేశ పెట్టుకోలేము. ఈ సృష్టిని అంతా గుణాలే నడిపిస్తున్నాయి, ప్రపంచాన్ని, ప్రతి జీవుడిని నడిపేది గుణాలు, సృష్టి యావత్తు నడిపేది గుణాలు. పరమేశ్వరుడు ఊరికే దీనికి సాక్షిగా ఉన్నాడు.

పరమేశ్వరుడు ఎలా ఉన్నాడు అంటే - రాత్రి దీపం దగ్గర కొందరు చదువుకొంటారు, కొందరు పేకాడతారు. అన్నం తింటున్న వాడికి అన్నం తినమని చెప్పదు. నువ్వు పెకాడుతున్నావు నీకు కాంతిని ఇవ్వనని దీపం చెప్పదు, చదువుకొంటున్న పిల్లవాడికి నీకు ఎక్కువ కాంతిని ఇస్తాను అనదు. చదువుకొంటున్న వాడికి, పేకాడే వాడికి, దొంగతనం చేస్తున వాడికి అన్నం తింటున్న వాడికి, ఒకే రకంగా కాంతిని ఇస్తుంది. అలాగే పరమేశ్వరుడు మన హృదయంలో సాక్షిగా ఉండి, మనం మంచి చేసినా చెడ్డ చేసినా ఆయన కాంతి సమానంగానే ఉంటుంది. అయితే పేకాడే వాడిని చదువుకొనే వాడ్ని అలా చెయ్యమని లైట్ చెప్పిందా? వాడి గుణాన్ని బట్టే చేస్తున్నాడు. పేకాట ఆడేవాడు తన గుణాన్ని బట్టి ఆడుతున్నాడు, చదువుకొనే వాడు తన గుణాన్ని బట్టి చదువుకొంటున్నాడు. అదే విధంగా మన గుణాల బట్టే మన చేష్టలు కలిగి, మనం ప్రకృతిలో ఆడుకొంటున్నాము. దీపం ఏ విధంగా అయితే చెప్పదో, ఈశ్వరుడు సాక్షీ మాత్రుడుగా ఉన్నాడు. సృష్టిలో సమస్త జీవరాశిని, ప్రపంచంలో ఎవరు ఏ రూపంలో ఉన్నప్పటికీ, ఈ 3 గుణాలు ఆడిస్తున్నాయి.

ఈ 3 గుణాలు - తమోగుణం రజోగుణం సత్వగుణం - తమో గుణానికి నలుపు గుర్తు, రజో గుణానికి ఎరుపు గుర్తు, సత్వ గుణానికి తెలుపు గుర్తు. మనలో ఈ 3 గుణాలు తిరుగుతూ ఉంటాయి. సత్వగుణం వచ్చినప్పుడు ఆ సత్వ గుణాన్ని పట్టుకొని, సత్వగుణం యొక్క పాదాల్ని ఆశ్రయించి నెమ్మదిగా అభివృద్ధి చేసుకొంటూ ఉంటే ఈ సత్వగుణం పెరుగుతుంది, ఎక్కువ రోజులు ఉంటుంది. ఆ సత్వగుణం పరమాత్మకు దారి చూపించి అడ్డు తప్పుకొంటుంది. అప్పుడు మనిషి గుణాతీతుడు అవుతాడు. సత్వగుణం ఎంత మంచిది అంటే అది ఉండదు, పరమాత్మకి దారి చూపించి, పరమాత్మని ఎలా తెలుసుకోవాలో మనకి నచ్చచెప్పి, పరమాత్మని తెలుసుకొనేలా మనని చేసి అది పక్కకి తప్పుకొంటుంది. అప్పుడు మనిషి గుణాతీతుడు అవుతాడు. ఎవడు గుణాతీతుడు అయ్యాడో, 3 గుణాలను దాటాడో, వాడు మాయని జయించినట్టు. మాయ ఈ 3 గుణాల రూపంలో ఉంది. ఎవడైతే మాయని జయించాడో వాడు నా స్వరూపాన్ని పొందుతాడు అని భగవంతుడు భగవద్గీతలో చెప్పాడు.

అందుచేత ఈ రోజు సబ్జెక్టు - ఆడంబరం లేకుండా జీవిస్తే, మాట్లాడితే, ఆడంబరంలేని చేష్టలతో జీవితంలో జాగ్రత్తగా ఉంటే దాని అంతట అదే వచ్చేస్తుంది జ్ఞానం. మీకు ఎంతో చదువు ఉందనుకోండి, ధనం ఉందనుకోండి, మనస్సు అంతర్ముఖం అవుతుందా, అవ్వదు. కేవలం ఈశ్వరుని కరుణవల్ల మనస్సు అంతర్ముఖం అవుతుంది. మనస్సు అంతర్ముఖం అయితే గాని జ్ఞానం రాదు. మీరు ఎన్ని పాటలు పాడి, ఎన్ని స్తోత్రాలు చేసి, ఎన్ని దేవుళ్ళను పొగిడినప్పటికీ మనస్సు బహిర్ముఖం అవుతా ఉంటే సత్యం తెలియదు. మనస్సు అంతర్ముఖం అవ్వాలి. మనస్సు లోపలికి దిగాలి. తలంపు మనస్సులో ఎక్కడ పుడుతోందో, లోపల అహంకారం ఎక్కడనుంచి విజ్రుభిస్తోందో తెలిస్తేనేగాని, లోపల తలంపు ఎక్కడ పుడుతోందో తెలిస్తేనేగాని, బయట స్తోత్రాలవల్ల చావదు. స్తోత్రాలు కొంతవరకు ఉపకారం చేస్తాయి.

దేనిని మిధ్య అంటారు - జ్ఞానం వల్ల నశించే దానిని మిధ్య అంటారు. మిధ్య అంటే లేదు అని అర్ధం. మారేదానిని మాయ అంటారు. ఏదైతే మారిపోతూ ఉంటుందో దానిని మాయ అంటారు. జ్ఞానం వల్ల అది నశిస్తుంది. నిజాన్ని మనం అబద్ధం అనుకొంటున్నాము, అలా అనుకొన్నప్పటికీ అది నిజమే. మనకి జ్ఞానం ఎప్పుడైతే కలిగిందో అప్పుడు నిజం నిజంగా తెలుస్తుంది. అప్పుడు అబద్ధం అబద్ధంగా తెలుస్తుంది. హంసలు హిమాలయాలలో

ఉంటాయి అని చెప్తారు. పాలు నీళ్ళు కలిపి ఇస్తే / పెడ్తే నీళ్ళు వదిలేసి పాలు తాగేస్తాయి అట. దానికి ఆ శక్తి ఉంది. భగవంతుడు దాని ముక్కుకి ఆ శక్తి పెట్టాడు, కుక్కకి వాసన శక్తి లాగ.

మనం కూడా హంసలలా ఉండాలి. రామకృష్ణుడికి రామకృష్ణ పరమహంస అని పేరు పెట్టారు. ఎందుకంటే ఆయన మాయని వదిలేసి సత్యాన్ని పట్టుకొన్నారు. అలాగే మనం కూడా పరమాత్మ నుండి ప్రకృతిని విడదీయాలి. ఏది నిజం ఏది నిజం కాదు, ఏది సత్యం ఏది సత్యం కాదు, ఆ హంసకి పాలనుంచి నీళ్ళని వేరుచేసే శక్తి ఎలా ఉందో, అలా విడదీసుకొనే శక్తి మన మనస్సుకి రావాలి. ఎవడికైతే ప్రకృతిని విడదీసే శక్తి కలిగిందో, ఆ వివేకం ఎవడికైతే కలిగిందో వాడు నిజాన్ని తెలుసుకొంటాడు. అదే వాడికి చివరి జన్మ. మీరు ఫలితం కోసం ఎదురు చూడకుండా చేసేది ఏదో అలా నెమ్మదిగా ప్రశాంతంగా చేసుకొంటే, ఈశ్వరుడు మిమ్మల్ని ఎప్పుడు ఎక్కడ ఎలా బహుమానం చెయ్యాలో అలా బహుమానం చేస్తాడు.

ఎవరికీ అవమానాలు అంటే ఇష్టం ఉండవు. బహుమానాలు అంటేనే అందరికీ ఇష్టం. కానీ బహుమానాలవల్ల మనస్సు బహిర్ముఖం అవుతుంది, అవమానాల వల్ల అంతర్ముఖం అవుతుంది. కానీ ఆ సంగతి మనకి తెలియక అందరూ మనకి బహుమానాలు ఇవ్వాలి అనుకొంటారు. ఎవరైనా అవమానాలు చేస్తే మనకి మనస్సు అంతర్ముఖం అవుతుంది. ఒక రకంగా వాళ్ళు మనకి ఉపకారం చేస్తున్నారు. బహుమానాల వల్ల మనస్సు బహిర్ముఖం అవుతుంది. బహిర్ముఖం అయిన మనస్సు సత్యాన్ని తెలుసుకోవటానికి పనికిరాదు.

మీరు నాకు 10 రూపాయలు బాకీ ఉన్నారనుకోండి, నాకు ఆ 10 రూపాయలు ఇచ్చేస్తే, బాకీ తీరిపోయింది అని ఎంతో తేలికగా అనిపిస్తుంది. అదేవిధంగా మీరు శరీరంలో ఏదైనా చెడ్డ కర్మ అనుభవించవలసి వస్తే, ఋణం తీర్చేస్తున్నాం అని సంతోషంగా అనుభవించండి. బాకీ తీర్చేస్తున్నాము అన్న మాట. శరీరంతో సుఖం అనుభవిస్తే పుణ్యం ఖర్చు అవుతుంది, దుఖం అనుభవిస్తే పాపం ఖర్చు అవుతుంది. పుణ్యం ఖర్చు అవ్వటం మంచిదా, పాపం ఖర్చు అవ్వటం మంచిదా? కష్టాలు అనుభవించటం వల్ల ఋణం తీరిపోతుంది, అంటే పాపం ఖర్చు అయిపోతుంది. అది మంచిదే కదా.

అంచేత పరమేశ్వరుడు మనకి ఏది ప్రసాదించినా శరణాగతి తోటి కనుక (మంచి వస్తే మంచి, చెడ్డ వస్తే చెడ్డ, అవమానం / బహుమానం ఏది వచ్చినా) ప్రశాంతంగా ఉండి ఈశ్వరుడి మీద పూర్ణ విశ్వాసంతో, భగవంతుడికి శరణాగతి చేసి, బరువు అంతా ఈశ్వరుడి మీద వేసి ఎవరైతే అనుభవిస్తున్నారో వారికి కొత్త వాసనలు పుట్టవు, పాత వాసనలు మరణిస్తాయి. వాడు జ్ఞాని అవుతాడు. మనస్సు ఎదురు తిరగకుండా ఎవడైతే ప్రశాంతంగా తన ఒంటి మీద ఉన్న ప్రారబ్ధాన్ని అనుభవిస్తున్నాడో, వాడికి పాత వాసనలు పోతాయి, కొత్త వాసనలు పుట్టవు.

మీ అందరికీ ఏవో తలంపులు వస్తున్నాయి కదా; వాసన లేకుండా తలంపు రాదు. వాసన ఎక్కడినుంచి వచ్చింది? మన కాళ్ళతోనో చేతులతోనో ఇంద్రియాలతోనో, మన పూర్వ జన్మలలో మన శరీరంతో చేసిన పనే వాసన. వాసన తలంపు కింద పుడుతుంది. ఆ తలంపు మళ్ళీ మన చేత పని చేయిస్తుంది.

ఎవరైతే సత్యాన్ని తెలుసుకోవాలనుకొంటున్నారో, సత్యాన్ని స్వరూపంగా పొందాలని అనుకొంటున్నారో, ప్రకృతి లోంచి విడుదల అవ్వాలని అనుకొంటున్నారో, వారు పరమ పవిత్రులు అయ్యి ఉండాలి. పవిత్రులు కాని వారికి జ్ఞానం రాదు. మహాత్మా గాంధీగారు అన్నారు - ధనం లేని వారు దరిద్రులు కాదు, ఎవరైతే పవిత్రులు కారో, ఎవరికైతే ప్రేమ లేదో వారు దరిద్రులు. యదార్థం చెప్పాలంటే ప్రేమలేని జీవితం ఉన్న వాళ్లకి, ప్రేమ లేని జీవితం గడిపే వాళ్లకి, పరమేశ్వరుడి సాక్షాత్కారం అవ్వదు.

మనస్సుని జయించటం కష్టం. ప్రపంచంలో పెద్ద చక్రవర్తి కంటే మనస్సుని జయించిన వాడే ఎక్కువ సుఖపడతాడు అని మన శాస్త్రం చెప్పుతోంది. మనస్సుని జయించటానికి అది ఉంటే కదా అంటారు రమణ స్వామి. ఉన్నది ఒక్కటే వస్తువు, రెండు లేవు, అది ఆత్మ. మీరు ఆత్మయందు దృష్టి పెట్టుకోండి, మనస్సు దానంతట అదే చచ్చిపోతుంది. There is no mind to control if the self is realised.

నువ్వు కనుక ఆత్మని దర్శిస్తే మనస్సు అంటూ లేదు. మనస్సులో దోషాలు అన్నీ రాలిపోయినయ్యి అనుకోండి మాటవరసకి, ఆ శుద్ధ మనస్సే పరబ్రహ్మంగా ప్రకాశిస్తుంది. మనస్సులో దోషాలు అన్నీ రాలిపోతేనే కాని వాడికి నిజం అంటే ఏమిటో తెలియదు; మనస్సు నిజం వైపు ప్రయాణం చేయటానికి ఇష్టపడదు. నీ మనస్సు నిజంగా పరిశుద్ధంగా ఉంటే, నీ మనస్సు చలించకూడదు, నీకు దుఖం రాకూడదు. దీన్ని బట్టి మీ మనస్సు శుచిగా పరిశుద్ధంగా ఉందో లేదో చూసుకోండి. మీ మనస్సు పరిశుద్ధంగా ఉంటే అది కదలదు మెదలదు, మీ మనస్సు చలించదు, మీకు దుఖం పుట్టదు.

మీలో ఎవరైనా దుఖం లేని వాళ్ళు ఉన్నారా? లోపల ఉన్న అజ్ఞానమే దుఖరూపంలో వస్తోంది. ప్రపంచం మనకి నిజంలా కనిపిస్తోంది. ఇది అబద్ధమని స్వప్నంతో సమానమని జ్ఞానం కలిగితే తెలుస్తుంది.

అయితే ధ్యానం జ్ఞానం కాదు, నామ రూపాలకి సంబంధించిన జ్ఞానం ఏదీ జ్ఞానం కాదు. అది అంతా స్వప్నం. ఆత్మ ఒక్కటే నిజం. నిజాన్ని తెలుసుకొన్నవాడే జ్ఞాని. నామరూపాలకి సంబంధించిన జ్ఞానాన్ని రిలేటివ్ నాలెడ్జ్ అంటారు. అది సత్యాన్ని తెలుసుకోవటానికి పనికిరాదు. మనస్సు అణిగిన చోటే ఆత్మ దర్శనం ఇస్తుంది. దేశ చరిత్రలు తెలుసుకొనే మనస్సు, శాస్త్రాలు తెలుసుకొనే మనస్సు మాటేమిటని. ఈ మనస్సు అనే సమస్యని ఎవరైతే పరిష్కరించారో వారికే జ్ఞానం కలుగుతుంది.

నేను అలా ఉండాలి ఇలా ఉండాలి అనుకొంటారు, వాళ్లకి జ్ఞానం రాదు. ఆత్మ అలా ఉండదు ఇలా ఉండదు. ఇది అంతా మనస్సు యొక్క కల్పితం. దశరద్ధుడి కుమారుడు రాముడు వసుదేవుడి కుమారుడు వాసుదేవుడు ఇటువంటి మాటలు తెలుసుకొని మనం జ్ఞానులం అయిపోయాము అనుకొంటాము. అంటే మనని మనం మోసం చేసుకొంటున్నట్టు లెక్క. ఇవన్నీ పుస్తకాలలో మాటలు. జ్ఞానం పుస్తకాలలో లేదు. భగవంతుడు పుస్తకాలు స్మరించమనలేదు. మీ హృదయంలో ఉన్న నన్ను స్మరించండి అన్నాడు. భగవంతుడు మీరు పుస్తకాలు కాదు

ధ్యానం చేయవలసినది, మీ హృదయంలో ఉన్న నన్ను ధ్యానం చేయండి అప్పుడు మీకు తెలియబడతాను అన్నాడు. అంతే కాని నాలుగు శ్లోకాలు నోటికి వస్తే మనం అంతా పండితులము అయిపోయాము, మనకి చదువు వచ్చేసింది అనుకొంటే మీరు బోర్లా పడతారు. మిమ్మల్ని మీరు మోసం చేసుకొంటారు.

మాయ ఇక్కడే ప్రారంభం అవుతుంది - మీరు అలా అవ్వాలి ఇలా అవ్వాలి అనుకొని పని చేస్తున్నారు; ఇది మాయ. ఎక్కడైనా పెద్ద గడ్డిమేటు కనిపించింది అనుకోండి, ఇంత గడ్డిమేటు మీకు కూడా ఉంటే బాగుండును అనిపిస్తుంది. ఈ మనస్సులా ఆత్మని తెలుసుకొనేది? మనం మనుషులతో స్నేహం చేస్తున్నాము కాని పరమాత్మతో స్నేహం చేయటం లేదు. ఎవరు భగవంతునితో స్నేహం చేస్తున్నాడో వాడికి భగవంతుడు తెలియబడతాడు కాని, మీరు ఎంతసేపు మనుషులతో స్నేహాలు, కాని భగవంతునితో స్నేహం చేసారా ఎప్పుడైనా మీ జీవితంలో? మీలో 40 ఏళ్ల వాళ్ళు 60, 80 ఏళ్ల వాళ్ళు ఉన్నారు, ఇంత కాలంలో ఎందఱో స్నేహితులు మారిపోయారు, పాత స్నేహితులు పోయి కొత్త స్నేహితులు వస్తున్నారు, కాని ఎప్పుడైనా భగవంతునితో స్నేహం చేసారా? బాగా ఇష్టమైన స్నేహితులు ఎప్పుడూ జ్ఞాపకం వస్తూ ఉంటారు కదా మీ మనస్సులో. మీరు భగవంతునితో స్నేహం చేసి ఉంటే, మీకు భగవంతుడు జ్ఞాపకం వచ్చి ఉండేవాడు. అంటే మీరు చేయలేదు ఆయనతో స్నేహం, అలా చేసి ఉంటే మీకు నిరంతరం భగవంతుడే జ్ఞాపకం వచ్చేవాడు.

మనం అందరం సాధనలు చేస్తున్నాం ఆత్మని తెలుసుకోవాలని. అయితే ఈ తెలుసుకోవాలని ప్రయత్నం చేసేది ఎవరు? ఇప్పుడు ఎవరుగా ఉన్నాం మనం? మనం ఆత్మగా లేము, అహంకారం గానే ఉన్నాం. ఆత్మని తెలుసుకొన్నాక, ఆత్మ తెలుస్తుంది అంటే ఇప్పుడు లేదనే కదా? ఆత్మ ఇప్పుడు లేనిది మధ్యలో వస్తే తర్వాత పోతుంది కదా. ఆత్మని తెలుసుకొన్నాక ఆత్మ అవుతాము అంటే తర్వాత కొంత కాలానికి అది పోతుంది. మధ్యలో వచ్చింది పోతుంది? పోయే ఆత్మ మనకెందుకు?

అయితే ఇప్పుడు ఎవరుగా ఉన్నా మనం - దానికేమన్నా బ్రేక్ వచ్చిందా? ఆత్మకి బ్రేక్ ఉందా? అహంకారం కల్పించిన అడవిలో, అజ్ఞానంలో మనం పడి కొట్టుకొంటూ, ఆ సముద్రంలో పడి ఈదుకొంటూ, మనం నిజం లేదు ఆత్మా లేదు అనుకొంటున్నాము. ఇది పెద్ద అడవి. ఇవి అన్నీ అహంకారం కల్పించింది. ఈ అడవిలో తిరుగుతూ దారి తెలియక ఆత్మ లేదని అనుకొంటున్నాము. మాయ ఏంటంటే ఇక్కడ ఇమ్మిడిఎట్ గా (immediate) హృదయంలో ప్రకాశిస్తున్న ఆత్మని తెలుసుకోవాలనే బుద్ధి లేకుండా, ఆత్మని తెలుసుకోవాలనే డైరెక్ట్ బుద్ధి మనకి ఉండటం లేదు, కాని రాబోయే జన్మ ఎటువంటిది వస్తుంది, భవిష్యత్తు ఎలా ఉంటుంది, అని ఇటువంటి ఆలోచనలతో అబద్ధం గురించి వెళ్తాము. ఎందుకు ఆత్మమీద మనస్సుని గురి పెట్టటం లేదు మనం? ఇదే మాయ, మనలో ఉన్న దోషం కారణం.

నా శబ్దం మీకు తక్కువ ఉపకారం చేస్తుంది, నిశబ్దం ఎక్కువ ఉపకారం చేస్తుంది. శబ్దం కంటే నిశబ్దం గొప్పది. శబ్దం చెరువు తోటి సమానం, నిశబ్దం సముద్రం తోటి సమానం. మీరు ఏదో పని చేయటం వల్ల ఆత్మ తెలుస్తుంది అనుకోవద్దు, పని చేయటం వల్ల వచ్చేది కాదు.

జగత్తు అంటే ఏది? కుందేటి కొమ్ము.
ఆచార్యులువారు వ్యవహారానికి జగత్తు నిజం అని ఒప్పుకొన్నారు. కుందేలుకి అసలు కొమ్మే లేదు. కొమ్ము లేనప్పుడు, లావుగా ఉంటుందా, సన్నగా ఉంటుందా అంటే ఎవరైనా చెప్పుతారా? వ్యవహారానికి జగత్తుని ఒప్పుకొన్నప్పటికి, వాస్తవంలో జగత్తు లేదు అంటున్నారు ఆచార్యులువారు.

కొంతమంది వాళ్లకి ఉపకారం చేస్తున్నాం, వీళ్ళకి సేవ చేస్తునాం, ఎంతో ఉపకారం చేస్తున్నాం అంటారు. దాని వల్ల కూడా అహంకారం పెరుగుతుంది. ఉపకారం చేయాలి, మేలు చేయాలి అనేవాడు మీలో ఒకడు ఉన్నాడు కదా. ఇందులో ఎంత సూక్ష్మంగా ఎంత మెలుకువగా జాగ్రత్తగా ఉండాలో తెలియటం కోసం చెప్తున్నాను. కొంతమంది రూపాయి ఉపకారం చేస్తారు 2 రూపాయిల అహంకారం పెంచుకొంటారు. అంటే ఈశ్వరుడికి దూరం అవుతున్నారు. ఇక్కడ మనం చేయాల్సింది, ఎవడైతే మనలో ఉపకారం చేయాలని చూస్తున్నాడో వాడు ఎవడో తెలుసుకోవాలి. తరువాత ఉపకారం చేయవచ్చు. కంగారు పడకండి. వాడిని ఎప్పుడైనా పట్టుకొన్నారా, లోపల ఎప్పుడైనా చూసారా? ఆ ఉపకారం చేసేవాడు ఎవడు?

మనకి కనిపిస్తున్న జగత్తు, మనకున్న జీవభావన అన్నీ స్వప్నంతో సమానం. ఎందుకంటే మనకి గాఢనిద్రలో జీవభావన లేదు లోకభావన లేదు దైవభావన లేదు. జాగ్రత్తగా ఆలోచించుకోండి, గాఢనిద్రలో ఉండగా మీకు మనస్సు జీవుడు ప్రపంచం దేవుడు ఎవరైనా గుర్తున్నారా, లేరు. దేవుడు, జీవుడు, లోకం గొడవలు ఏమీ లేవు. కానీ గాఢనిద్రలో మనం ఉన్నాం. మన శరీరంతో సంబంధం లేకుండా మనం ఉన్నాం. హాయిగా నిద్రపోతున్నాం. చావుతోటి కాని పుట్టుకతోటి కాని ఏమీ సంభందం లేకుండా మనం ఉన్నాం. గాఢనిద్రలో ఉన్న ఎవరు మనం? గాఢనిద్రలో ఉన్నది ఇప్పుడు కూడా ఉంది మనకి. అయితే అది, ఆ స్థితి, ఇప్పుడు ఎందుకు అనుభవంలోకి రావటంలేదు? తలంపులు కారణం. భగవాన్ అన్నారు - స్లీప్లెస్ స్లీప్ కావాలి మనకి, నిద్ర కాని నిద్ర. ఎవరికైతే నిద్ర కాని నిద్ర వచ్చిందో వాడు జ్ఞాని అవుతాడు అని చెప్పారు. నిద్రలో ఎలా ఉన్నారో ఇప్పుడు జాగ్రధవస్తలో అలా ఉండమన్నారు - స్లీప్లెస్ స్లీప్ (sleepless sleep). వాడు జ్ఞాని అవుతాడు. అంటే మీరు మెలుకువగా ఉండాలి, నిద్రలో ఉన్న స్థితి తెచ్చుకోవాలి. వాడు జ్ఞాని అవుతాడు, సమాధి స్థితి పొందుతాడు.

యావత్తు సృష్టిని నడిపే పరమేశ్వరుడు మీ కష్టసుఖాలు చూడలేడా, మిమ్మల్ని నడపలేదా, మీ భారం మోయలేడా? సోదరమహాశయులారా నిజమైన త్యాగం ఏమిటంటే, ఎవడైతే తన అహంకారాన్ని విడిచిపెడుతున్నాడో వాడే త్యాగి. వాడే జ్ఞాని అవుతాడు. జ్ఞాని కాని వాడు సుఖి కాలేడు.

మనం పూజల పేరుతో భక్తి పేరుతో అహంకారాన్ని పెంచుకొంటే జ్ఞానానికి దూరం అవుతాం. మనలో అహంకారం ఎప్పుడైతే రాలిపోయిందో, స్వరూపం అక్కడ ఉంది. మనని దేవుడినుంచి ఏదైతే వేరు చేస్తుందో, నా స్వరూపం నుంచి, నాలో సహజమైన సుఖం నుంచి ఏదైతే వేరు చేస్తుందో, నాలో వెలుగులోంచి ఏదైతే వేరు చేస్తోందో, ఆ వేరు చేసేదాన్ని పోగొట్టేవాడే గురువు. నాలో నిజమైన సుఖం ఉంది, అయితే ఆ సుఖం ఇప్పుడు నా అనుభవంలో

లేదు. నా అనుభవంలో లేకుండా ఆ సుఖం నుంచి ఏదైతే వేరు చేస్తోందో, ఆ కాంతి ఆ శాంతి నుండి ఏదైతే వేరు చేస్తోందో, దాన్ని క్రింద పడగొట్టే వాడే గురువు. వాడే నిజమైన గురువు.

కొంత మంది అంటారు మీ వల్ల మాకు కొంత శాంతి వస్తోంది అని. అది కూడా అబద్ధమే. నా వల్ల రావటం కాదు. నేను మీకు జ్ఞాపకం వస్తే, జ్ఞాపకం రావటం వల్ల మీ మనస్సు అంతర్ముఖం అయితే, మీ హృదయంలో ఉన్న సుఖం శాంతి మీ మనస్సుకి తగిలి, సుఖం వస్తోంది. మీ శరీరం ఎటువంటిదో నా శరీరం అటువంటిదే. ఆ సుఖం మీదే నాది కాదు, కాని నా వల్ల వచ్చిన దానివలే అది కనిపిస్తోంది - అది అబద్ధం. ఆత్మకి మరో పేరే సుఖం. మనకి అందరికీ సుఖం కావాలి. శరీరం అక్కరలేదు అని చెప్పవచ్చు కాని మాకు సుఖం అక్కరలేదు అనేవారు ఉన్నారా?కానీ మనలో ఉన్న దోషం, మనలో ఉన్న లోటు ఒక్కటే - సుఖం అందరికీ కావాలి కాని ఆ సుఖం ఎక్కడ ఉందో తెలియదు. ఎవరైతే తమ దేహ ప్రారబ్ధాన్ని ఇష్టంగా సంతోషంగా అనుభవించటం లేదో వారికి కొత్త వాసనలు వస్తాయి. మనం దేహంతో ఏ పని చేయాలో ఆ పని చేయటం ఎలాగో తప్పదు. ఆ చేసేది బాధ పడుతూ చేయటంకంటే సంతోషంగా చేస్తే మనకి జ్ఞానం తొందరగా కలుగుతుంది.

అనిర్వచనీయమైనది ఏది?

నిర్వచించలేనిది డిఫైన్ చేయలేనిది మాయ. మారుతున్నది మాయ. అది లేదు, ఉన్నదానివలె కనిపిస్తుంది. అది నిజంగా ఉంటే పోదు. మాయ ఎక్కడ ఉంది, పాలకొల్లు లో దొరుకుతుందా, మనకి బజారులో దొరుకుతుందా? మాయని ఎప్పుడైనా చూశారా? దాని అడ్రస్ తెలిస్తే కదా దాన్ని పట్టుకోవటానికి? అందరూ మాయని జయించటం కష్టం అంటారు. అసలు నిర్వచించలేము, మాయ ఇట్టిది అట్టిది అని చెప్పలేము, అసలు నిర్వచనానికి లొంగదు అని చెప్తున్నారు ఆచార్యులు వారు. మాయ ఎక్కడ ఉందో ఎలా ఉంటుందో మనకి తెలియదు. మాయని జయించాలి అంటే అసలు మాయ అంటే ఏమిటో అర్థం అవ్వాలి కదా? మాయ అంటే ఏమిటో అర్థం అవ్వకుండా మాయని జయించలేరు కదా. మాయని జయించకుండా ఈశ్వరుడిని పొందలేము కదా. ఈ ఒక్క చిన్న పాయింట్ మీరు అర్థం చేసుకోండి - ఇది కీలకం. మీ తలంపులే మాయ. మీకు మంచి తలంపులో చెడ్డ తలంపులో వస్తున్నాయి కదా? మాయ మీ తలంపుల రూపంలో ఉంది. మీరు తలంపులు వదిలేసి బయట వెదుకుతున్నారు మాయ కోసం. అందుకే అది దొరకటం లేదు. మీ తలంపులే మాయ, మాయ అనేది బయట లేదు.

ఒక మాట చెప్తున్నాను నన్ను క్షమించండి. మనం హరే రామ హరే కృష్ణ, అరుణాచల శివ అంటున్నాము; నామం చేస్తున్నాము. ఇదంతా ఎవరు చేస్తున్నారు, మనస్సు చేస్తోంది - ఇదంతా మెంటల్ ఆక్టివిటీ (mental activity). అయితే ఈ ప్రాపంచిక తలంపుల్లోంచి, ఈ మనస్సుని బయటికి తీయటం కోసం ఈ నామం పెట్టారు. కానీ ఇది కూడా మనస్సే చేస్తోంది. హరే రామ అని అరుణాచల శివ అని మనస్సు అంటోంది. ఇదంతా మనస్సు చేసే గారడీ. మీ మనస్సు మూలం మీకు తెలిస్తే మీరు ప్రార్థించే రాముడు కాని కృష్ణుడు కాని ఏసు కాని శివుడు కానీ వచ్చి మీ ఎదుట నిలిచినా మీకు కళ్ళు ఎత్తి చూడాలని కూడా మీకు అనిపించదు. మీరు దేవుడుని ఎందుకు ప్రార్థిస్తున్నారు, సుఖ పడదామని. ఆ సుఖం మీకు తెలిస్తే దేముడితో పని ఏముంది; ఆ సుఖమే మీరు అయితే దేముడితో పని

ఏముంది? మనం దేముడిని స్మరించటం కూడా మనస్సు చేసే పనే, అది కూడా తలంపే, అది కూడా మాయలో ఒక భాగమే.

ఈ నగ్న సత్యాన్ని అర్థం చేసుకొంటే, తెలుసుకొంటే, ఈ క్షణంలో, ఈ సెకండ్లో, మీరు జ్ఞానులు అవుతారు. మీరు ఏ దేవుడిని ఆరాధించినా బహిర్ముఖం అయిన మనస్సుకి జ్ఞానం తెలియబడదు. అసలు మన లక్ష్యం ఏంటి, గోల్ ఏంటి? లౌకికుల మాట వదిలేయండి, ఆధ్యాత్మిక మార్గంలో భక్తి మార్గంలో ఉన్నవారి లక్ష్యం ఏమిటి గోల్ ఏమిటి అసలు? వాళ్ళు ఏ మతం వాళ్ళో ఎవరి భక్తులో అనవసరం. మీరు దేవుడిని తెలుసుకోవటానికి సాధన ప్రయత్నం ఎందుకు చేస్తున్నారు? మీరు దేన్నీ తెలుసుకోవటానికి ప్రయత్నం సాధన చేస్తున్నారు, ఎందుకు చేస్తునారు, మీరు తెలుసుకోవలసిన అవసరం ఏముంది?

ఎవరి ముఖం చూస్తే మన మనస్సు అంతర్ముఖం అవుతుందో వారే మహాత్ములు. మనస్సుని అంతర్ముఖం చేయటమే గురువు చేసే మొదటి పని, మధ్య పని, చివరి పని కూడా. మాయ మన తలంపుల రూపంలో వస్తోంది. మాయకి రూపం లేదు గడ్డాలు మీసాలు లేవు, అది మన తలంపుల రూపంలో వస్తోంది. తలంపు రూపంలో వచ్చి మనని ఆడిస్తోంది మాయ. తలంపు ఎక్కడి నుంచి వస్తోంది - లోపల తలంచేవాడు ఉంటే వస్తోందా, తలంచేవాడు లేకుండా వస్తోందా తలంపు? తలంచేవాడు ఉండాలి తలంపులు రావాలంటే, ఈ సటిల్ (subtle) పాయింట్ అర్థం చేసుకోండి. లోపల తలంపులు రావాలంటే తలంచేవాడు ఒకడు ఉండాలి అక్కడ. ఆ తలంచేవాడు ఎవడు? వాడే జీవుడు. వాడికే కొత్త దేహాలు కావాలి, వాడికే ప్రకృతి కావాలి. ఆ జీవుడికే మరొక పేరు అహంకారం. లోపల జీవుడు ఉన్నంత కాలం జీవ లక్షణాలు ఎక్కడికి పోతాయి?

నిగ్రహం ఏం చేస్తుంది, నీకు విషయం అర్థం కానప్పుడు? నిగ్రహం నిగ్రహం అంటారు - కిం కరిష్యతి నిగ్రహం? భగవంతుడు వాసుదేవస్వామి గీతలో చెప్పారు - నిగ్రహం నిగ్రహం అంటున్నారు, నిగ్రహం ఏమి చేస్తుంది, విషయం అర్థంకానప్పుడు, ప్రకృతి లెగదీసి బయటికి గెంటేస్తుంది.  మనందరికీ జ్ఞానం కావాలి, ఎవరికి వస్తుంది జ్ఞానం? నిగ్రహం కిం కరిష్యతి! విషయం అర్థం చేసుకోకుండా నిగ్రహించుకొంటే అది ఆగుతుందా? గెంటి అవతల పారేస్తుంది ప్రకృతి నిన్ను మాయలోకి; నిగ్రహం ఏం చేస్తుంది? కొంతమందికి నిగ్రహం వల్ల ఆగ్రహం పెరిగే అవకాశం కూడా ఉంది. విషయం అర్థం చేసుకోవాలి, బలవంతాన్న నిగ్రహించుకొంటే అది ఆగదు. డిస్క్రిమినేషన్ (discrimination) అవసరం, మీకు విడదీసుకొనే శక్తి అవసరం.

మీరు ఎవరు, జీవుడు మీరు. జీవుడు ఉంటేనే జీవ లక్షణాలు వస్తున్నాయి; జీవుడు లేకుండా జీవ లక్షణాలు ఏమిటి అసలు? శరీరం ఉంటే ఏదో ఒక రోగం వస్తుంది. శరీరం లేని వాడికి రోగం ఏమిటి అసలు? అంటే లోపల అహంకారం ఉంటే దానికి సంబంధించిన లక్షణాలు వస్తాయి. జీవత్వం ఉంటే జీవ లక్షణాలు వస్తాయి; జీవత్వం లేకుండా రావు. శరీరం ఉన్న వాడికే అహంకారం; శరీరం ఉన్నవాడికే రోగం. అయితే మాయ అహంకార రూపంలో ఉంది. మనకి జరిగేది అంతా లోపలే జరుగుతోంది, బయట ఏమీ లేదు. మీకు కోపం వస్తోంది అనుకోండి, కామం

వస్తోంది అనుకోండి, ద్వేషం వస్తోంది అనుకోండి, బయటి నుంచి వస్తోందా లోపలి నుంచి వస్తోందా? సమస్తం మీకు లోపలినుంచే వస్తున్నాయి. ఇవి ఎక్కడినుంచి వస్తున్నాయి అని మీరు ఎప్పుడైనా మనస్సుని లోపలికి గెంటారా?

మీకు మంచి గుణాలు రానివ్వండి చెడ్డ గుణాలు రానివ్వండి, బయటి నుంచి వస్తున్నాయా లోపలినుంచి వస్తున్నాయా? ఇదే సమస్య ఇక్కడ. లోపలి నుంచే వస్తున్నాయి, లోపల నుంచి వస్తుంటే ఎక్కడనుంచి వస్తున్నాయి? లోపల ఏదో ప్లేస్ ఉండాలి కదా అక్కడ? పెద్ద పాము వచ్చింది అనుకోండి, దానికి ఏదో ప్లేస్ రెసిడెన్స్ ఉండాలి - పుట్టలోంచో లేకపోతే చెట్టు కింద దాని మకాం ఉంటుంది, ఇక్కడికి వస్తుంది. అలాగే మీలోంచి గుణాలు వస్తున్నాయి అంటే మీలో ఎక్కడో దాక్కొని ఉన్నాయి. అవి ఎక్కడినుంచి వస్తున్నాయో ప్లేస్ మీకు కనిపించే వరకు ఈ గుణాలు బయటికి వెళ్ళవు. ఈ జన్మలో కాకపోవచ్చు కావచ్చు మరో జన్మలో కావచ్చు, ఈ లోకంలో కావచ్చు మరో లోకంలో కావచ్చు, కానీ గుణాలు దారి ఇవ్వవు ఆ ప్లేస్ అర్థం అయితేనే కాని. ఏ దేవుడు మీకు సహాయం చేయలేడు ఆ ప్లేస్ మీకు అర్థం అయితేనే కానీ.

అందుచేత భగవంతుడు ఏమని చెప్పాడంటే, ఎవరైతే నన్ను ప్రార్థిస్తున్నారో, ఎవరైతే నేనే గతి అని నమ్మి జీవిస్తున్నారో వారికి జ్ఞానం అర్థం చేసుకొనే సద్బుద్ధిని ప్రసాదిస్తాను. ఏ రకమైన బుద్ధిని ప్రసాదిస్తే వాడికి జ్ఞానం అందుతుందో; వాడి మంచి లక్షణాల వల్ల, మంచి గుణాల వల్ల, వాడి సద్బుద్ధి వల్ల, వాడికి నా పట్ల ఉన్న భక్తి వల్ల, వాడికి అటువంటి బుద్ధిని ప్రసాదిస్తాను అన్నాడు. ఆ బుద్ధివల్ల మీరు జ్ఞానాన్ని చేరుకొంటారు. అయినా సద్బుద్ధిని ప్రసాదించు తండ్రీ అని ప్రార్థించే వాళ్ళు మనలో ఎంతమంది ఉన్నారు? సద్బుద్ధి ఎవరికి కావాలి? అసలు గ్రాంట్ చేస్తారో లేదో, ఇస్తారో లేదో తరువాత విషయం; అసలు ప్రార్థించే వాళ్లము ఎంతమందిమి ఉన్నాము సద్బుద్ధిని ప్రసాదించమని?

అంతా లోపలినుంచే వస్తోంది కదా, బయటికి చూడటం ఏమిటి వెర్రి చూపు; బయట చూస్తే ఏముంది అసలు బయట? పోనీ నేను చెప్పే మాటలు అబద్ధమైతే మీరు చెప్పండి; మీకు లోపలి నుంచి వస్తున్నాయా వాసనలు, బయటి నుంచి వస్తున్నాయా? నేను చెప్పేది సహేతుకమా లేక అహేతుకమా? అది ఎక్కడినుంచి వస్తోంది, ఎందుకు వస్తోంది, ఎలా వస్తోంది, ఎప్పుడు వస్తోంది - ఈ విషయం మీకు అర్థం అయితే ఈ సెకండ్ లో మీరు జ్ఞానులు అవుతారు. వాయిదాల తోటి పనిలేదు మీకు అసలు; పోస్ట్పోన్మెంట్ (postponement) తోటి పని లేదు. ఎందుకంటే వస్తువు అక్కడ నిజంగా ప్రకాశిస్తోంది కాబట్టి. వస్తువు అక్కడ ఎవర్ రెడీ గా అవైలబెల్ గా (ever ready and available) ఉంది కాబట్టి.

యదార్థం చెప్పాలంటే మనం లేము నిజం ఉంది. నిజం ఎవరైతే తెలుసుకోవాలి అనుకొంటున్నాడో వాడు లేడు, నిజం ఉంది. ఇది బాగా అర్థం చేసుకోండి - సత్యాన్ని తెలుసుకోవాలి, నిజాన్ని తెలుసుకోవాలి, నేను దేవుడిని తెలుసుకోవాలి అని అనుకొంటున్నాము మనం అందరం. దేవుడిని తెలుసుకోవాలి అనుకొనేవాడు, సత్యాన్ని తెలుసుకోవాలని అనుకొనేవాడు, ధర్మాన్ని తెలుసుకోవాలి అనుకొనేవాడు ఎవరూ నిజంగా లేరు అక్కడ. సత్యం ఉంది సత్యాన్ని తెలుసుకోనేవాడు లేడు. అందుకే మాయని ఎవరూ నిర్వచనం చేయలేరు అన్నారు ఆచార్యులు

వారు. మనం అందరం దేవుడిని నిజాన్ని తెలుసుకోవాలి అనుకొంటున్నాం. అందుకే కదా ఇక్కడికి వచ్చాం. ఆచార్య స్వాములువారు అంటున్నారు - దేవుడు ఉన్నమాట నిజం, దేవుడిని తెలుసుకోవాలి అనుకొనేవాడు అబద్ధం. మరి సాధనలు అన్నీ ఎవరు చేస్తున్నారు? వాడు ఉన్నాడని ఒప్పుకొన్నాం కాబట్టి సాధనలు చేయమన్నారు. ఒక బరువు తీసుకొచ్చి మన నెత్తిమీద పడేసారు. దేవుడిని తెలుసుకొనేవాడు ఒకడు ఉన్నాడు అని ఒప్పుకొన్నాం కాబట్టి - ముందు, ఒకడు లేని వాడిని తీసుకొచ్చి పీటేసి కూర్చోపెట్టాం కాబట్టి - సాధన చేయండి అయ్యా అన్నారు.

మళ్ళీ ఈ సాధనల వల్ల దెబ్బలాటలు ఒకటి - ఏసుక్రీస్తు గొప్పవాడని, రాముడు గొప్పవాడని, సృష్టిలో అందరికంటే వాడు గొప్పవాడని వీడు గొప్పవాడని దెబ్బలాటలు. ఇది మూర్ఖత్వం; ఇదీ మాయే.  ఆ దేవుడు గొప్పవాడని, ఈ మతం గొప్పదని, ఈ గురువు గొప్పవాడని - ఎంతమంది గురువులు ఉన్నారు? ఉన్నది ఒక్కటే వస్తువు, అది ఆత్మ.

గురు శబ్దానికి ఎవడు అర్హుడు? ఎవడైతే ఆత్మని దర్శించాడో వాడు గురువు అవుతాడు. ఆత్మని దర్శించని వాడు గురువు కాదు. ఏదో 4 మాటలు చెప్పినంత మాత్రాన్న గురువు కాదు. ఆత్మని దర్శించినవాడు గురువు. ఉన్నది ఒక్కటే వస్తువు. ఇద్దరు ఉంటే, వీడి కంటే వాడు గొప్ప వాడి కంటే వీడు గొప్ప - కాని ఉన్నది ఒక్కటే వస్తువు. గొప్ప ఏంటి తక్కువ ఏంటి దానికి? సబ్జెక్టుని ఏం అర్థం చేసుకొంటున్నారు మీరు?!

డబ్బా నూనె తీసుకొచ్చి ఖర్చు పెట్టమంటే పెట్టగలరు కానీ, 4 వేలు తీసుకొచ్చి చందా ఇవ్వమంటే ఇవ్వగలరు కానీ, ఒక్క 4 నిమిషాలు ప్రశాంతంగా కూర్చొని సబ్జెక్టు ఆలోచించమంటే ఆలోచించలేరు. ఇదే మాయ. కనుక ప్రశాంతంగా కూర్చోండి, మాటలు శ్రవణం చేయండి, ఇవి మనస్సులో పెట్టుకోండి. పుస్తకంలో ఉన్నది మస్తకంలోకి రానివ్వండి. మీరు జాగ్రత్తగా మననం చేయండి. విషయం అర్థం చేసుకోవటం కోసం రెండు నిమిషాలు భగవంతునికి ప్రసాదించండి. మీ కాలంలో కొన్ని నిమిషాలో, కొన్ని గంటలో భగవంతునికి ఇవ్వండి, విషయాన్ని అర్థం చేసుకోవటానికి. ఇదే మాయ - మీరు బాహ్యమైన పనులు ఎన్నైనా చేయగలుగుతున్నారు కానీ విషయాన్ని అర్థం చేసుకోవటానికి మీరు ప్రయత్నం చేయటం లేదు. అందుచేత మాయ మీకు దారి ఇవ్వటం లేదు.

అయితే బయటి మంచి పనులు మీరు చేయవచ్చు; ఎవరు చేస్తున్నారు? కత్రుత్వం ఉంటే చేస్తున్నారు; దానికి పుణ్యం వస్తుంది, అనుభవించండి!

స్వామీ వివేకానంద చెప్పారు - తిండి మీద ఎక్కువ కోరిక ఉన్నవాడు మనిషి జన్మ కోరుకోవద్దు అన్నారు, పంది జన్మ కోరుకోమన్నారు. దానికి ఎంత తిన్నా అజీర్తి అనేది లేదు. మనకి తినాలని ఉన్నా అజీర్తి చేస్తుంది, ఏం సుఖం ఈ జన్మ మనకి? అందరికీ తలో శరీరం ఉంది. ఏం చేసుకొంటాం ఈ శరీరాన్ని, దీనితో పనేంటి? ఎందుకు వచ్చింది ఈ శరీరం, దీని వల్ల మనం పొందవలసినది ఏమిటి? మన గోల్ ఏమిటి, ఏమి సాధించాలి? ముందు ఇది నిర్ణయం చేసుకోండి.

మనకి డబ్బు ఉంటే చందాలు ఇవ్వవచ్చు, దాని వల్ల పుణ్యం వస్తుంది కానీ జ్ఞానం రాదు. మీ ఇంద్రియాలతోటి మంచి పనులు చెయ్యవచ్చు. మంచి పనుల వల్ల పుణ్యం వస్తుంది, జ్ఞానం రాదు. ఎందుకంటే లోపల కర్తృత్వం ఉంది. పుణ్యం చేసేవాడు ఉన్నాడు. నేను చేస్తున్నాను, నేను చేస్తున్నాను అనే వాడు ఉన్నాడు. కర్తృత్వం ఉన్నప్పుడు పుణ్యం వస్తుంది కాని జ్ఞానం రాదు. ఎవడైతే కర్తృత్వాన్ని బలి చేస్తున్నాడో వాడు జ్ఞాని అవుతాడు. పుణ్య కార్యక్రమాల వల్ల కనుక జ్ఞానం వస్తే, ముందు ధనవంతులందరికీ జ్ఞానం వచ్చేయాలి. ముందు బిర్లా గారికి టాటా గారికి జ్ఞానం వచ్చేయాలి, వాళ్ళు ఎన్నో కట్టడాలు కట్టించారు కాబట్టి.

ఇప్పుడు మనం ఇంటికాడ చేసుకొనే పనులు మానేస్తే జ్ఞానం రాదు, సోమరితనం వస్తుంది. బుద్ధికి పని చెప్పాలి. మీ శరీరానికి ఎంత పని చెప్పుతున్నారో అలా బుద్ధికి పని చెప్పాలి. మీకు జ్ఞానం వచ్చేస్తుంది. మనం అన్ని ఇంద్రియాలకి పని చెప్పుతున్నాం కాని బుద్ధిని గాలికి వదిలేసాం. భగవంతుడు అసలు నిన్ను నడిపే డ్రైవర్ బుద్ధి అంటున్నాడు. కారులో కూర్చొన్న వారు అందరూ పెద్ద మనుషులే కాని డ్రైవర్ సారా త్రాగి కారు ఎక్కాడు; అప్పుడు ఏమవుతుంది? అంటే కారుని నడిపే డ్రైవర్ ఎటువంటివాడో, అలాగే మన శరీరాన్ని, మన ఇద్రియాలని, మన మనస్సుని నడిపే డ్రైవర్ మన బుద్ధి. మనం మన బుద్ధిని గాలికి వదిలేసి మిగతావి అన్నీ పట్టుకొంటున్నాము. బుద్ధిని గాలికి వదిలేసి నేను బాగుపడాలి బాగుపడాలి అంటే ఎలా బాగుపడతాం? మన బుద్ధిని బాగుచేసుకోకుండా మనం ఎలా బాగుపడతాం? మనని నడిపేవాడు వాడే కదా. నా బుద్ధి నన్ను నడుపుతోంది మీ బుద్ధి మిమ్మల్ని నడుపుతోంది. బుద్ధి నిర్మలం అవ్వాలి, కుదుట (కుదురు) పడాలి. మీ దగ్గర బాగా డబ్బు ఉందనుకోండి, కుదురు నేర్చుకోండి ముందు డబ్బెట్టి.

మాయ ఇటువంటిది అటువంటిది అని నిర్వచనం చెప్పలేం అన్నారు ఆచార్యులు వారు. ఉందంటే ఉందని చెప్పలేం లేదంటే లేదని చెప్పలేం. అసలు లేదని అనుకొంటాం అనుకోండి మరి మనని ఎవరు ఆడిస్తావుంటా? మన మాయ ఆడిస్తోంది.

సహనం పెర్సోనిఫికేషన్ (personification) - కొంతమంది మనుషులని చూస్తే సహనం వాళ్ళ రూపం ధరించిందా అనిపిస్తుంది. ఓర్పు వాళ్ళ రూపం ధరించినదా అనిపిస్తుంది. వాళ్లకి జ్ఞానం వస్తుంది. అసలు సహనం ఎవరి రూపంలో అయితే వచ్చిందో వాళ్లకి జ్ఞానం వస్తుంది. మనకి చదువు వల్ల సహనం రాదు అనుకోండి, వినయం రాదు అనుకోండి, ఆ చదువు అనవసరం. అందుచేత మీరు ఆవేశం పడకండి, ఆవేశ పడితే రాదు. మీరు ఆవేశం వల్ల మంచి చేయవచ్చు చెడ్డ చేయవచ్చు కాని జ్ఞానం మట్టుకు రాదు.

మీరు ఏకాంతంగా కూర్చోండి; ఏకాంతంగా ఉన్నప్పుడు మీరు ఎవరో మీకు తెలుస్తుంది. అందుకే భగవంతుడు గీతలో (18 వ అధ్యాయం లో) ఏకాంతవాసం అవసరం అని చెప్పాడు. నలుగురులో కూర్చున్నప్పుడు అందరూ పెద్ద మనుషులే. మీరు ఏకాంతంగా ఉన్నప్పుడే మీ నిజమైన మతం ఏమిటో మీకు తెలుస్తుంది. మీకు ఎటువంటి తలంపులు వస్తున్నాయి, ఇది చూసుకోవాలి కాని, మీరు హిందూ మతం అయితే ఏముంది క్రైస్తవ మతం అయితే ఏముంది; మీరు రాముడు భక్తులు అయితే ఏముంది రమణ భక్తులు అయితే ఏముంది?

మీలో అహంకార రూపంలో ఉన్న పెద్ద రాయిని బయటికి లాగి ఊడదీసి పడవేయ తగ్గవాడు ఈశ్వరుడు ఒక్కడే. ఆ రాయి బయటికి వస్తేనే కానీ అసలు దారి కనబడదు. మీ అహంకారం మీకు బరువు కాని బయటికి తీయటానికి, ఈశ్వరుడికి బరువు కాదు. మీ డిక్షనరీ లో అసాధ్యం ఉంది కానీ ఈశ్వరుడికి ఏదీ అసాధ్యం కాదు. మనకి అసాధ్యం అయినవి అన్నీ ఈశ్వరుడికి సాధ్యమే.

భక్తి పేరు చెప్పి సఫరింగ్ వద్దు. ఎవరూ బాధ పడకండి. మానసిక వ్యాధి ఉన్నా శారీరిక వ్యాధి ఉన్నా బాధ వస్తుంది. భక్తి పేరు చెప్పి ఎవరూ బాధ పడకండి. మీరు సాధన చేస్తున్నాం సాధన చేస్తున్నాం అనుకొంటున్నారు; మీరు సాధన చేస్తున్నారు కూడా, మంచిదే. రేపు రమణ జయంతి కాబట్టి రేపు మధ్యాహ్నం 12 గంటల లోపులో (రేపు వస్తారు కదా 11, 12 గంటలకి) ఈ సాధన చేస్తున్నాం ఇంతకాలం నుంచి - నాలో ఉన్నాడు ఎవడో సాధన చేస్తున్నాడు కదా - ఈ సాధన చేసేవాడు ఎవడు, ఎక్కడ ఉన్నాడు, వీడి గుట్టు ఏమిటి, వీడు ఏ మకాంలో ఉంటున్నాడు; ఇలా తిరగేయండి ఈ పట్టు! రేపటికి ఎలా ఉంటుందో మీ మనస్సు!!

ఈశ్వరుడు ఎప్పుడు వస్తాడో ఎక్కడ వస్తాడో ఎలా వస్తాడో టైం ఆయన సెలెక్ట్ చేసుకొంటాడు. మీ అందరినీ ఈశ్వరుడు ఎన్నుకొన్నాడు; ఎన్నుకోవటం పూర్తి అయిపోయింది. కాని మీ అజ్ఞానాన్ని ఎప్పుడు, ఎక్కడ, ఎలా దొంగిలించాలో టైం మట్టుకు ఆయనకి విడిచి పెట్టేయండి. మిమ్మల్ని అందరినీ సెలక్షన్ చేసేసుకోవటం మట్టుకు జరిగిపోయింది. కానీ ఈశ్వరుడు ఎప్పుడు ఏ రూపంలో వస్తాడో, ఎలా మీ అజ్ఞానాన్ని తొలిగిస్తాడో అది ఆయన పని. ఎందుచేతంటే ఈశ్వరుడు కనుక మిమ్మల్ని సెలెక్ట్ చేయకపోతే మీరు ఆదివారాలు ఇక్కడికి రానే రారు. నేను ఏదో చెప్పుతున్నానని కాబట్టి మీరు వినటానికి వస్తున్నారు అని ఇక్కడ కారణం కనిపిస్తోంది కాని అది నిజం కాదు. ఈశ్వరుడు మిమ్మల్ని సెలెక్ట్ చెయ్యకపోతే ఇక్కడికి రారు అస్సలు. మీరు ఏమీ బరువు మోయవద్దు. బరువు అంతా ఈశ్వరుడి మీద వేయండి. ఈశ్వరుడి మీద బరువు వేస్తే మీరు మోయ్యక్కరలేదు. బరువు మొయ్యటం వల్ల దుఖం వస్తుంది. బరువు ఈశ్వరుడి మీద వెయ్యండి; ఈశ్వరుడికి ఎదురు తిరగవద్దు.

కొంతమంది నాకు పాద నమస్కారాలు చేస్తున్నారు, అవి అక్కరలేదు. మీరు విషయాన్ని సబ్జెక్టుని అర్థం చేసుకోటానికి ప్రయత్నం చెయ్యండి. మనస్సు కుదురుగా ఉంచుకొని, విన్న విషయాన్ని, సబ్జెక్టుని, మాటని అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేయండి. అదే నిజమైన నమస్కారం. నేను చెప్పే మాటలను మీరు అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చెయ్యటమే నన్ను గౌరవించినట్టు.

ఎండిపోయిన ఆకులు గాలి చేతిలో ఎలా ఉంటాయో మనం ఈశ్వరుడి చేతిలో అలా ఉండాలి. కొంతమందికి కోరికలు నెరవేరటం వల్ల కూడా భక్తి పెరుగుతుంది. మనకి భగవంతుడు ఈ కోరిక నెరవేర్చాడు కదా, భక్తి పెంచుకొందాం అని; అలా పెంచుకొంటారు కొంతమంది. బయట ఉన్న భగవానుకి మీరు దండలు వేసినా దీపారాధన చేసినా అష్టోత్తరాలు సహస్రనామాలు చేసినా, ఆ భగవాన్ చేసే సహాయం ఏమిటంటే మీ లోపల ఉన్న భగవంతుడి దగ్గరకి తీసుకెళ్లతాడు. బయట ఉన్న భగవంతుడు నిజం కాదు; మీ లోపల ఉన్న భగవంతుని దగ్గరకి తీసుకెళ్లటానికి

సహకరిస్తాడు బయట ఉన్న భగవంతుడు. ఇది అంతా మీ కోసమే, ఆయన కోసం కాదు. భగవాన్ కోసం ఇది అంతా చేస్తున్నాము అని మీకు అనిపించవచ్చు. అనిపించినప్పటికీ అది నిజం కాదు. మీ కోసం మీరు చేసుకొంటున్నారు. దీపారాధన చేసినా దండలు వేసినా క్షీరాన్నం వండుకొన్నా మీ కోసమే.

భగవాన్ అనేవారు, నా కంటే గుళ్ళో దేవుడే మెరుగు. గుళ్ళో దేవుడికి క్షీరాన్నం అరటిపళ్ళు చూపించి పట్టుకుపోతున్నారు. నన్ను క్షీరాన్నం తాగమంటున్నారు అరటిపళ్ళు తినమంటున్నారు. నా పుట్టిన రోజు మీరందరూ చేస్తున్నారు. నా పుట్టిన రోజు చేసే బదులు మీరు పుట్టిన రోజున నేను అనేది ఎక్కడ పుట్టిందో చూసుకోండి. నా పుట్టిన రోజు చేస్తే మీకు ఏమి వస్తుంది? నా శరీరానికి పుట్టిన రోజు ఎలా ఉందో మీ శరీరానికి కూడా పుట్టిన రోజులు ఉన్నాయి కదా. 365 రోజులలో కనీసం ఒక్క రోజైనా మీ పుట్టిన రోజు వస్తుంది కదా. కనీసం మీరు పుట్టిన రోజున, ఒక్క రోజైనా సంవత్సరంలో, ఈ నేను అనే తలంపు ఎక్కడ పుట్టిందో చూసుకోండి. ఈ శవానికి దండలు వేస్తే ఏమి వస్తుంది?

చలంగారు అన్నారు - భగవాన్ కుమారస్వామి అవతారమా, ఈశ్వరుని అవతారమా అదంతా నాకు అక్కరలేదు. భగవాన్ ఎవరో నాకు అక్కరలేదు, భగవాన్ ఏమిటో నాకు అక్కరలేదు, భగవాన్ ఎందుకో నాకు అక్కరలేదు, ఆయన దగ్గర నుంచి నాకు శాంతి వస్తోంది, కాంతి వస్తోంది, ఆయన దగ్గర నుంచి నేను ఏది పొందుతున్నానో నాకు అదే కావాలి. ఆయన ఈశ్వరుడి అవతారం, కుమారస్వామి అవతారం అవ్వవచ్చు, కాకపోవచ్చు. ఆయన దగ్గరనుంచి నాకు శాంతి కాంతి వస్తున్నాయి. నాకు కావలసింది అది.

రమణ చత్వారింసత్ చదవటం వల్ల మీకు రమణ స్వామి మీద గౌరవం భక్తీ పెరుగుతుంది. ఆ భక్తిలో మీ అహంకారం కరుగుతుంది. భక్తి అనే గంగలో మన అహంకారం కరుగుతుంది; నీటిలో ఉప్పు కరిగినట్టు. అందుకే భక్తి. భక్తే నిజమైన సొమ్ము. కొంతమంది, చదువు ఎంత కష్టపడి చదువుకొంటారో, రూపాయిలు ఎంత కష్టపడి సంపాదించుకొంటారో, కొంతమంది భక్తిని అంత కష్టపడి సంపాదించుకొంటారు; వారు ధన్యులు.

ఓం శాంతి శాంతి శాంతి